క్లుప్తంగా

రేపటి నుంచి ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవాలు



రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం నుంచి ఈనెల 19వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం అమ్మవారికి చండీహోమం, ప్రత్యేక పూజలు, ఆరోజు సాయంత్రం తొర్రేడు మహిళా బృందంతో భజన నిర్వహిస్తారు. 18వ తేదీ 108 మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం, లక్ష పుష్పాలతో అమ్మవారికి అర్చన, సాయంత్రం గరగ నృత్యాలు, తీన్మార్, మేళతాళాలతో ఊరేగింపు జరుగుతుంది. 19న అమ్మవారికి విశేష పూజలు, అన్నసంతర్పణ జరుగుతుంది.

ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



ఎస్వీ శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంపీ భరత్‌రామ్, రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి రాజమహేంద్రవరానికి చెందిన ఎస్వీ శ్రీనివాసరావును నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఎంపీ కార్యాలయంలో ఆయనను ఎంపీ మార్గాని భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు అభినందించారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో నిర్మించిన వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కార్యాలయాన్ని శనివారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

లాటరీ వద్దు.. పాత పద్ధతినే కొనసాగించాలి

రాజమహేంద్రవరం సిటీ: చేపల వ్యాపారులకు లాటరీ విధానం వద్దని, పూర్వ విధానాన్నే కొనసాగించాలని జాంపేట చేపల మార్కెట్ హోల్‌సేల్, రిటైల్ చేపల వర్తక సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చేపల మార్కెట్‌లో గతంలో పెద్దల ఆదేశాలతో ఏవిధమైన తగువులు లేకుండా వ్యాపారాలు సాగించేవారమన్నారు. ఇప్పుడు కొత్తగా నగరపాలక సంస్థ లాటరీ విధానం ప్రవేశ పెట్టడం వల్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు అక్కల కోటేశ్వరరావు, ముసిరి నాగు, ఎడ్ల రమేష్, వాసుపల్లి నారాయణ, కూరం అప్పారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు సుబ్బారెడ్డి మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పిల్లా సుబ్బారెడ్డి శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మరణ వార్తను తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోత శారద, డాక్టర్ వడయార్, బెజవాడ రంగారావు తదితరులు ఇన్నీసుపేటలో పిల్లా సుబ్బారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతదేహంపై కాంగ్రెస్ పతాకం కప్పి గౌరవ వందనం చేశారు.

బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు

సీతానగరం: స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కురియాల కస్తూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్ మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి, పాల్గొనే హక్కు, భాగస్వామ్యపు హక్కు ఉన్నాయన్నారు. పోక్సోచట్టం, బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ఈ.మహాలక్ష్మి, మండల సమాఖ్య సీసీడీ రమాచక్ర, ఎస్.పేరినాయుడు, టి.లక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం డీపీఎం అమర్ పాల్గొన్నారు.

పేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కడియపులంకలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో పార్టీ నాయకులు

కడియం: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం జగన్ లక్ష్యమని, దానికి అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కడియపులంక, జేగురుపాడు, మురమండ గ్రామాల్లో రూ.2.53 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికే సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు

కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేటలో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్, రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, కడియపులంకలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, దోసాలమ్మ కాలనీలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను మంత్రి వేణు ప్రారంభించారు. మురమండలో రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.60 లక్షల నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. జేగురుపాడులో రూ.25 లక్షల రుడా నిధులతో మల్టీపర్పస్ యాక్టివిటీస్ సెంటర్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, మురమండ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణీ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఈలి గోపాలం, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, సొసైటీ చైర్మన్లు తిరుమలశెట్టి శ్రీను, ఈదర దయాళ్, వెలుగుబంటి అచ్యుతరామ్, పార్టీ నాయకులు ఊటుకూరి శైల, కొత్తపల్లి శివాజీ, ఈలి గోపాలం, దాసరి శ్రీను, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, మెల్లిం గంగరాజు, ఎంపీడీవో జి.రాజు మనోజ్, మండల వ్యవసాయాధికారి కె.ద్వారకా దేవి తదితరులు పాల్గొన్నారు.



బొమ్మూరులో పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా 45 రోజులుగా రూ.కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు మంత్రి వేణు తెలిపారు. బొమ్మూరు నేతాజీ నగర్ నాలుగో వీధిలో రుడా నిధులు రూ.11.60 లక్షలతో నిర్మించే పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ఆయన శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న శాసన సభ్యుడు ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. తాను వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన 45 రోజుల్లోనే స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం ద్వారా పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు, నేతాజీ నగర్ వాసులు పాల్గొన్నారు.



టిడ్కో లబ్ధిదారుకు ఫ్లాట్ నమూనా తాళం అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్, రౌతు సూర్యప్రకాశరావు

చంద్రబాబు వల్లే టిడ్కో ఇళ్ల పంపిణీ ఆలస్యం

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- శాటిలైట్ సిటీ, బొమ్మూరు గ్రామాల్లో లబ్ధిదారులకు ఫ్లాట్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద టిడ్కో గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, వాటిని చంద్రబాబు దారి మళ్లించారని, అందువల్లే ఇళ్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శాటిలైట్ సిటీ, బొమ్మూరు గ్రామాలలో లబ్ధిదారులకు శుక్రవారం టిడ్కో గృహాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు నిర్వాకంతోనే టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయడంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో గృహాలను పూర్తి స్థాయిలో నిర్మించేందుకు రూ.వేల కోట్లు వెచ్చించారన్నారు. టీడీపీ పాలనలో ఆ నాయకులు ఫ్లాట్ల లబ్ధిదారుల నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేసి స్వాహా చేశారని ఆరోపించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ ఓ రికార్డు

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ 25 వేల మంది పేదలకు ఒక్కరోజు ఇళ్ల పట్టాలు అందజేశామని, ఇది గొప్ప రికార్డు అన్నారు. ఎన్నికలకు వెళ్లేలోపు ఇళ్ల స్థలాలు అందజేస్తానని హామీ పత్రాలిచ్చిన లబ్ధిదారులకు మాటిచ్చానని, ఆ మాట కోసం తాడేపల్లి సీఎంవోలో మూడు, నాలుగు రోజులు ఉండి, సీఎం జగనన్న సహకారంతో సాధించానని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం నాలుగైదు వేల మందికి ఇలా పట్టాలు ఇచ్చి ఉండొచ్చునన్నారు. అది కూడా జన్మభూమి కమిటీలు, నేతలకు డబ్బులు ఇచ్చిన వారికే అందజేశారన్నారు. శాటిలైట్ సిటీలో 1,104, బొమ్మూరులో 1,200 టిడ్కో గృహాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే, నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమాలలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏడీసీ సత్యవేణి పాల్గొన్నారు.

క్రీడాకారులకు పూర్తిస్థాయి వసతులు

- ఎంపీ భరత్‌రామ్
- స్క్వాష్ కోర్టు, పార్కు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: క్రీడాకారులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 2వ డివిజన్ వెంకటరామయ్య నగర్‌లోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టు వద్ద రూ.99 లక్షలతో నిర్మించిన స్క్వాష్ కోర్టును, 10వ డివిజన్ మోడల్ కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించిన మున్సిపల్ పార్కులను కమిషనర్ దినేష్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అలాగే రూ.3 కోట్లతో చేపట్టే ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



ఇండోర్ స్పోర్ట్స్ కాంపెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

అభివృద్ధిని ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూడలేకే ప్రతిపక్షాలు విమర్శలు, ఆరోపణలు చేస్తున్నాయన్నారు. తాను మాత్రం విశ్వ నగరంగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దేవరకూ ఎన్ని అవరోధాలు, ఆటంకాలు వచ్చినా, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానన్నారు. నగరంలో ఒకే రోజు 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం రికార్డు అని, సీఎం జగనన్న వల్లే అది సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యేగా తనని గెలిపిస్తే ఇళ్లలను కట్టిస్తానని ఎంపీ భరత్ రామ్ అన్నారు. కార్యక్రమాలలో ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వాలి

సీటీఆర్ఐ: కోనేరు రంగారావు తన సిఫారసులో ప్రతి పేద కుటుంబానికి కనీసం ఎకరం భూమి ఇచ్చేందుకు సరిపడా రాష్ట్రంలో భూములున్నాయని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని, ఈ మేరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రతి పేద కుటుంబానికి కనీసం ఎకరం భూమి కేటాయించాలని ఆదివాసీ మహా సభ డిమాండ్ చేసింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడారు. రంపచోడవరం కేంద్రంగా తొలితరం గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కారం తమ్మన్న దొర జిల్లాను ప్రకటించాలన్నారు. 11 మండలాలు గల రంపచోడవరం నియోజకవర్గాన్ని రెండుగా విభజించాలని, ఆదిమ గిరిజన తెగలకు లందరికీ అంత్యోదయ కార్డులివ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రేషన్‌షాపులను నెల పొడవునా తెరిచే వుంచాలని కోరారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు ప్రణాళిక

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వినియోగదారుల హక్కులను కాపాడేందుకు జిల్లాలో పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. కలెక్టరేట్‌లోని డీఎస్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం 'వినియోగదారుల కొరకు న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు' అనే అంశంపై చర్చ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించడం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. వినియోగదారుల హక్కులు, ప్రయోజనాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పి.విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

తూర్పుకాపు కల్యాణ మంటపానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో నిర్మిస్తున్న తూర్పుకాపు కల్యాణ మంటపం నిర్మాణానికి రుడా నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు వెల్లడించారు. 45వ డివిజన్ ఇందిరానగర్‌లో తూర్పుకాపు విద్యావిజ్ఞాన అభివృద్ధి సంఘం పేరుతో నిర్మిస్తున్న తూర్పు కాపు కల్యాణ మంటపం నిర్మాణానికి ఎంపీ భరత్‌రామ్‌తో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సుమారు 16 సెంట్లు విస్తీర్ణంలో నిర్మించే కల్యాణ మంటపానికి రూ.30 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. సమావేశంలో పాల్గొన్న ఇయ్యపు మాధవ్ రూ.5 లక్షలు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ బురిడి అనురాధ, బురిడి త్రిమూర్తులు దంపతులు రూ.లక్ష, అలాగే అడపా శ్రీహరి, యజ్జరపు మరిడయ్య చెరో రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్

సినిమాలు	
శ్యామల	: భీమా
సూర్యమినీ	: బస్తర్, యోధా
సూర్యప్యాలెస్	: కుంగ్‌ఫూ పాండా–4
స్వామి	: వెయ్‌దరువెయ్
శివజ్యోతి	: హనుమాన్
అనుశ్రీ	: ప్రేమలు
రాజా	: రజాకార్
ఊర్వశి	: రజాకార్
రంభ	: తంత్ర
మేనక	: లంబసింగి, షరతులు వర్తిస్తాయి
అప్సర	: గామి
కుమారి	: మాయ, ప్రేమలు
నామవరం	
వీఎస్ మహల్	: రజాకార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ప్రేమలు

502 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామ సచివాలయం –4 పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 502 మందికి వైద్యసేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. శిబిరాన్ని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు జి.రోహిత, స్పెషలిస్టులు జాన్, వరిషా, ఆప్తాల్మిక్ ఆఫీసర్ సాంబయ్య రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముందుగా ప్రపంచ గ్లకోమా పక్షోత్సవాల సందర్భంగా డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి, అనంతరం రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గ్లకోమా పక్షోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సుధాకర్, వైద్య సిబ్బంది

కాపునాడు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశం నగర్: కాపునాడు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు కాపునాడు పార్లమెంట్ అధ్యక్షుడు గుదే రఘునరేష్ నియామక పత్రాలు అందజేశారు. మహిళా విభాగం రాజమండ్రి పార్లమెంటు అధ్యక్షురాలిగా ప్రముఖ న్యాయవాది కొత్తపల్లి భాగ్యలక్ష్మి, రూరల్ నియోజకవర్గం కార్యదర్శిగా కర్రి నాయుడు, సంయుక్త కార్యదర్శిగా పిల్లా ప్రసాద్, రాజమండ్రి అర్బన్ 9వ వార్డు అధ్యక్షుడిగా పడాల వీరబాబు, 29వ వార్డు అధ్యక్షుడిగా నెట్టిమి తిరుమలరావు, 41 వ వార్డు అధ్యక్షుడిగా సింహాద్రి వెంకట దుర్గాప్రసాద్, 44వ వార్డు అధ్యక్షుడిగా కుప్పాల అప్పారావు, 16వ వార్డు (రూరల్) అధ్యక్షుడిగా పసలపూడి లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, ఉపాధ్యక్షులు దేవకివాడ చక్రపాణి, అడబాల నాగబాబు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం



ర్యాలీ చేస్తున్న ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు



రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

కంబాలచెరువు: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం కన్స్యూమర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, పరిరక్షణ యంత్రాంగం, వినియోగదారుల పరిరక్షణ చట్టం 2019 అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డాక్టర్ ఎ.అన్నపూర్ణ, హెచ్.శ్రీరామ్ పవన్, వి.రమేష్ కృష్ణ పాల్గొన్నారు.

చైతన్యంతోనే హక్కుల పరిరక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చైతన్యంతోనే హక్కులను పరిరక్షించుకోగలమని ప్రముఖ న్యాయవాది, జీఎస్‌కేఎం లా కళాశాల సీనియర్ అధ్యాపకుడు పి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సం సందర్భంగా నటరాజ్ సెంటర్‌లోని రైతుబజార్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ రైతుబజార్లు ఏర్పాటు చేయడం ద్వారా ఇటు రైతులకు,వినియోగదారులకు లాభదాయకంగా ఉందన్నారు. అనంతరం రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావును సత్కరించారు.

రూ.1.41 లక్షలకు వేలం ఖరారు

మధురపూడి: కోరుకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఉత్సవాలు ఈనెల 19 నుంచి 25 తేదీ వరకూ జరగనున్న విషయం తెలిసిందే. ఉత్సవాల సందర్భంగా దేవస్థానంలో కొబ్బరి చెక్కలు, తలనీలాలు పోగుచేసుకోవడానికి, అలాగే పాదరక్షలను భద్రపరిచేందుకు వేలం పాటలు నిర్వహించారు. వీటి ద్వారా దేవస్థానానికి రూ.1,41,000 వచ్చినట్టు అన్నవరం దేవస్థానం పర్యవేక్షణాధికారి కె.సూర్యనారాయణ తెలిపారు. కొబ్బరి చెక్కలకు రూ.76,500, తలనీలాలకు రూ.5,500, పాదరక్షల స్టాళ్లకు రూ.59 వేలకు వేలం ఖరారైందన్నారు.